క్లుప్తంగా

వైద్య విద్యార్థినికి సీఎం సహాయ నిధి మంజూరు



వైద్య విద్యార్థిని ముమ్మడి మాధవికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడికి చెందిన ముమ్మడి వెంకట సత్యనారాయణ కుమార్తె మాధవి వైద్యవిద్య ఖర్చుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. జాయింట్ కలెక్టర్ బీ. లావణ్యవేణి తన కార్యాలయంలో శుక్రవారం మాధవి, కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. మాధవి ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఆమె సర్టిఫికెట్లన్నీ కాలిబూడిదయ్యాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి మాధవికి రూ.10 లక్షలు మంజూరు చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

భీమడోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, సర్పంచ్ పాము సునీత అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పుట్టిన రోజు సందర్భంగా పూలదండలు, బొకే స్థానంలో ప్రజలు స్వచ్ఛందంగా అందించిన పుస్తకాలు, పెన్నులను శుక్రవారం భీమడోలు ఉన్నత పాఠశాల, అరుంధతీ కాలనీ, ఆర్జావారిగూడెంలోని ప్రాథమిక పాఠశాలల్లోని చిన్నారులకు పంపిణీ చేసారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, మండల కన్వీనర్ రావి పాటి సత్యశ్రీనివాస్, సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక సభ్యుడు తుమ్మగుంట రంగ, మాజీ వార్డు సభ్యుడు సుతాపల్లి ప్రసాద్, నాయకులు రామిశెట్టి శ్రీను, ఆర్తి సురేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. శుక్రవారం రామారావుగూడెంలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని వెంకట్రాజు, పర్వతనేని నరేంద్ర, పుల్లా శివప్రసాద్, పేరం ప్రసాద్, బాబ్జి, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి, సచివాలయ ఉద్యోగులు, వైద్య బృందం ఉన్నారు.

చేబ్రోలులో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష

ఉంగుటూరు: చేబ్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 510 మంది రోగులు హాజరయ్యారు. శిబిరంలో డాక్టర్లు శ్రావణ రెడ్డి, వర్మ, భానుప్రకాష్, అశ్విని వైద్యసేవలందించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది సేవలందజేశారు.

వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి

నిడమర్రు: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పి. తేజశ్రీ కోరారు. శుక్రవారం బావాయిపాలెం జెడ్పీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 355 మందికి వైద్య పరీక్షలు, పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గుండె జబ్బుల గుర్తించేందుకు 55 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ మేఘన, చిన్నపిల్లల వైద్యనిపుణులు కె. కిషోర్, ఎంపీహెచ్‌వో పి.కృపావరం, సూపరిండెంట్ ప్రియదర్శిని తదితరులున్నారు.

'సిద్ధం' సభకు భారీ ఏర్పాట్లు

- నేడు దెందులూరులో బహిరంగ సభ
- తరలివెళ్లేందుకు సిద్ధమైన వైఎస్సార్ సీపీ నాయకులు
- ఎన్నికల నిర్వహణపై శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం



సిద్ధం బహిరంగ సభ వేదిక


దెందులూరు: 'సిద్ధం' బహిరంగ సభకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆశ్రం, దెందులూరు మధ్య గల సహారా ప్రాంగణం ముస్తాబైంది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేదిక నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేయనున్నారు. 8 రోజుల నుంచి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల పార్టీ శ్రేణులు ఉత్సాహంగా బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. సభా వేదిక, ప్రాంగణం,హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేదికకు నాలుగు వైపులా దెందులూరు నియోజకవర్గం పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పార్టీ జెండాలు, మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు అవసరమైన తాగునీరు, ఇతర వసతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ 'సిద్ధం' బహిరంగ సభ చిరకాలం గుర్తుండేలా విజయవంతం చేసేందుకు ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారన్నారు. ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



సభావేదిక వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్ కుమార్

సీఎం సభకు తరలి వెళ్లేందుకు సన్నద్ధం

భీమడోలు/ఉంగుటూరు: సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఉదయమే కేటాయించిన గ్రామాలకు బస్సులు చేరుతాయి. బస్సుల్లో ప్రయాణించే కార్యకర్తలకు ఆహారం, తాగునీరు, మజ్జిగ వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే వాసుబాబు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి 120 బస్సులు, ఆటోలు, కార్లు, మోటార్ బైక్‌ల్లో సీఎం సభా స్థలికి పార్టీ శ్రేణులు, మహిళలు, అభిమానులు 20వేల మంది చేరుకునేలా నాయకులు ఏర్పాట్లు చేశారు. భీమడోలు మండలం నుంచి 20 బస్సులు, 20 కార్లు, 20 ఆటోలు, 400 మోటార్ బైక్‌ల్లో 5వేల మంది తరలి వెళ్లేలా సంసిద్ధులయ్యారు. కొల్లేరు వాసులు తాము సైతం సిద్ధమంటున్నారు. భీమడోలు, ఉంగుటూ రు, నిడమర్రు, గణపవరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా సభ ప్రాంగణానికి చేరుకుంటారు. భారీ ర్యాలీ గుండుగొలను వంతెన వద్దకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటుంది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు వారికి దిశానిర్దేశం చేసి భారీ ర్యాలీని ప్రారంభిస్తారు.



స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కటౌట్

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య



బువ్వనపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చి, వారిని అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ పేదల హృదయాల్లో కొలువయ్యారని వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు అన్నారు. ప్రీ హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయిన బువ్వనపల్లి పాఠశాలలో తొలిసారిగా 8వ తరగతిలో చేరిన 33 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్‌ఎం సంకు ఏసుబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఆశయాన్ని విద్యార్థులు నెరవేర్చాలని సూచించారు. ఎంఈవో కె.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా బోధన చేస్తున్నట్లు తెలిపారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంకు శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ తన్నీడి వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ అలుమోలు లక్ష్మీకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గ్రామ సచివాలయ భవనాల ప్రారంభం

నిడమర్రు: సీఎం జగన్ రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం రూ.90 లక్షల నిధులతో నిర్మించిన బావాయిపాలెం, అడవికొలను గ్రామ సచివాలయ నూతన భవనాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించి ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లీనిక్స్, డిజిటల్ లైబ్రరీలకు శాశ్వత భవన నిర్మాణాలు పెద్ద ఎత్తున నిర్మించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. బావాయిపాలెంలో రూ.20లక్షలు, అడవికొలనులో రూ.20 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ మురుగునీటి డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. బావాయిపాలెం సర్పంచ్‌గా ముత్యాల సుబ్బలక్ష్మిబాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రూ.20లక్షల నిధులతో అభివృద్ధి చేసిన గ్రామ శ్మశాన వాటికను ప్రారంభించారు. అడవికొలనులో గ్రామస్తులు ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ నిమ్మల అశ్వనీకుమార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగేషు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ముత్యాల బాలాజీ, గ్రామపార్టీ అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బయ్య, పాపోలు సుబ్బారావు, సర్పంచ్ పాల వెంకన్న, ఎంపీటీసీ మజ్జి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు పోశింశెట్టి గణేష్, నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మల బుజ్జి, మాజీ అధ్యక్షుడు నిమ్మల రాము, సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, బొబ్బిలి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల విశ్వనాథరాజు తదితరులున్నారు.



అడవికొలను గ్రామ సచివాలయ భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

జగనన్న గోరుముద్ద పథకం అమలుపై పర్యవేక్షణ

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం పగడ్బందీ నిర్వహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, వారు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అదనపు డైరెక్టర్-2 ఎస్. షరీఫ్ అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో శుక్రవారం జగనన్న గోరుముద్ద పథకం, పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు, నాడు - నేడు, ఐరన్ ఫోలిక్ మాత్రలు, శానిటరీ న్యాప్‌కిన్లు, ఆదాయ పన్ను, అకడమిక్ అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అదనపు డైరెక్టర్ ఎస్.షరీఫ్, ఎండీఎం నిర్వహణాధికారులు బి.కుమార్, ఎస్.గౌస్‌మొహిద్దీన్ పాల్గొని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడుల్లోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, ర్యాంపులను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఆగడాలలంక హెచ్‌ఎం ఎంఏ సత్యనారాయణ, వివిధ శాఖల హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఘన సత్కారం

ఉంగుటూరు: ఉత్తమ సేవలందించిన తహసీల్దారు వెంకటరమణ అభినందనీయులని ఎన్నికల డీటీ పోతురాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరులో బదిలీ అయిన తహసీల్దారు వెంకటరమణను అభినందన సత్కార కార్యక్రమం డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు అధ్యక్షతన నిర్వహించారు. డీటీ బొడ్డేపల్లి ప్రసాదు, ఎంపీడీవో ఆఫీసు సూపరింటెండెంట్ ఆంజనేయబాబు, ఎంఈవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, వీఆర్వో సంఘం నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు తహసీల్దారుగా కేవీ శివయ్య

ఉంగుటూరు: ఎన్నికల నిర్వహణలో పూర్తి బాధ్యతగా పని చేస్తామని ఉంగుటూరు తహసీల్దారు కేవీ శివయ్య తెలిపారు. శుక్రవారం ఉంగుటూరు తహసీల్దారుగా శివయ్య బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా పెనమలూరు తహసీల్దారుగా పనిచేసి ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు.

పెదపాడు తహసీల్దార్ బదిలీ

పెదపాడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెదపాడు మండల తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు కృష్ణా జిల్లా నందివాడకు బదిలీ అయ్యారు. నందివాడ తహసీల్దార్ భావన్నారాయణ పెదపాడుకు బదిలీపై రానున్నారు. ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో విజయకుమార్‌రాజు శుక్రవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు.



ఉంగుటూరులో తహసీల్దార్ వెంకటరమణను సత్కరిస్తున్న గ్రామ రెవెన్యూ అధికార్లు

ఉత్తమ సేవలకు గుర్తింపు

పెదపాడు: ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని పెదపాడు తహసీల్దార్ జి విజయకుమార్ రాజు తెలిపారు. పెదపాడులో తహసీల్దార్ వీడ్కోలు సభ వీఆర్వోల అసోషియేషన్, వీఆర్యేల అసోషియేషన్, సర్వేయర్లు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్‌ఎఎస్‌ఆర్ చంద్రమూర్తి, బెవర కోటేశ్వరరావు, నటరాజన్‌దాసు, నర్సింహరావు, పోలుకొండ రాంబాబు, సర్వేయర్ కోదండరామ్, ఆర్ఐ బలుసు గీతిక పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

దెందులూరు: సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా దెందులూరు, ఏలూరు ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, ఆళ్ల నాని ఆధ్వర్యంలో జరిగే వైఎస్సార్ సీపీ ఎన్నికల సన్నాహక బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో మాట్లాడుతూ సిద్ధం సభకు కృష్ణా జిల్లా, ఉభయగోదావరి జిల్లాల నుంచి వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలిరావాలన్నారు. పెత్తందారులకు వైఎస్సార్ సీపీకి మధ్య జరిగే ఎన్నికల కురుక్షేత్రంలో ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. సిద్ధం బహి రంగ సభకు హాజరయ్యే వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు ప్రత్యక్షచర్యలు తీసున్నారని అన్నారు, రాష్ట్రంలోని దెందులూరు నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసేలా శనివారం దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో జరిగే సిద్ధం ఎన్నికల సన్నాహక సభ విజయవంతం కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోరారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంట ప్రసాద్ మాట్లాడుతూ సిద్ధం ఎన్నికల సన్నాహక సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలు ప్రతి ఒక్కరు హాజరై కనీవిని ఎరుగని రీతిలో సీఎం బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు. వారం రోజులుగా సహారా గ్రౌండ్స్‌లో శ్రమిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవనం

గణపవరం: అన్ని ఆరోగ్య సమస్యలకూ మూలం అపరిశుభ్రత, దోమలే కారణమని, పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చునని గణపవరం మండలం కాశిపాడు సర్పంచ్ కోటనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పరిశుభ్రత, అంటువ్యాధుల వ్యాప్తిపై కరపత్రాలను అందజేసి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



కాశిపాడులో పరిశుభ్రతపై ప్రదర్శన చేస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

పెదపాడు: నియోజకవర్గంలోని దెందులూరులో సిద్ధం సమావేశానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానుండటంలో గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ శానిటేషన్ పనులు పర్యవేక్షిస్తున్నారు. సభా ప్రాంగణంలో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీలు సూర్య కుమార్, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

భీమడోలు: దివ్యాంగులను దాతలు ఆదుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 55 మంది దివ్యాంగులకు దాతల ఆర్థిక సాయంతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగులకు దాత దాట్ల అర్జునరాజు బియ్యం, పండ్లు అందించారు. మత్తేవారిగూడెంకు చెందిన దాత ఉచ్చుల హరికృష్ణ, వంశీ అన్నదానం చేసారు. దివ్యాంగుల సేవా సమితి సభ్యులు జిల్లా వికలాంగుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణంను ఘనంగా సత్కరించారు. ఎంజీఎఫ్ సంస్థ ప్రతినిధులు మానేపల్లి రామారావు, పి.పండరీనాథ్, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, ఏ.సోములు పాల్గొన్నారు.